నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | సోమవారం 6 నవంబర్ 2023 www.ntnews.com

మీకు తెలుసా?

సాంఘిక సంక్షేమానికి బడ్జెట్

తెలంగాణలో కేటాయింపులు

2015-16లో	2022-23లో
₹ 10,007 కోట్లు	₹ 33,443 కోట్లు

బీజేపీ పాలిత గుజరాత్‌లో... ₹ 7,160 కోట్లు (2022-23లో)

కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో... ₹ 15,563 కోట్లు (2022-23లో)

యార్కర్

మనకు అన్నం పెట్టే సీఎంగావాలే!

అన్నా, అన్నా.. మనకుగూడ
మంచి రోజులస్తున్నయే
బీజేపోళ్లు గెలిస్తే ఈ సారి
బీసీని సీఎం చేస్తరట
మన బీసీ నాయకుడు సీఎం
అయితే మన బీసీ బతుకులు
బాగుపడతయే

కాషాయ పార్టీ మాటలు నమ్మిన
ఓ తమ్ముడు ఎగపోసుకుంటచ్చి
ఈ ముచ్చటను చెప్పిండు..

అరేయ్ తమ్మీ.. ఇన్ని రోజులు
దేశ ప్రధానిగా ఎవరున్నరు?

ఇంకెవరన్నా మన బీసీ నేత మోదీనే
మరి బీసీలు ఏమన్న బాగుపడ్డరా?
దేశంల బీసీలం 80 కోట్లున్నం
ఈ తొమ్మిదేండ్లళ్ల మన కోసం
ఓ ప్రత్యేక మంత్రిత్వ శాఖనన్న
ఏర్పాటు చేసిండ్రా?
దేశంల మన బలగమే 60 శాతంరా
చట్టసభల్ల రిజర్వేషన్లు ఇచ్చినా..
పోనీ కేసీఆర్ సార్ లెక్క బీసీలకు
బీసీ బంధులాంటిది పెట్టిండ్రా?
మన కులవృత్తులోళ్లకన్నా ఏమన్న
చేసిండ్రా?

గంతెందుకురా.. ఆళ్ల పార్టీలనే సూడు..
మొన్నటిదాకా ఆ పార్టీ అధ్యక్షుడు
బండి సంజయ్.. ఆయన బీసీ..
ఇప్పుడెవరున్నరు? కిషన్‌రెడ్డి!
ఎలచ్చన్లు లేనప్పుడు బీసీని అధ్యక్షుడిని
చేసి
కరెక్ట్ ఎలచ్చన్ల టైములనే
బీసీ నాయకుడికి ఢోకా ఇచ్చిన్రు
మరి గసోంటోళ్లు బీసీ సీఎంను చేసినా
ఢిల్లీల రిమోట్ ఒత్తితే ఇక్కడ కదిలే
ఆ బీసీ సీఎం మనకేమన్న చేత్తడా?

అందుకేరా తమ్మీ
బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీ కాదు..
మన కడుపులకు రోజు ఐదు వేళ్లు
పొయ్యేటట్టు..
మన బతుకులు ఆగంకాకుండా
ఆత్మగౌరవంతో బతికేటట్టు చేసినోళ్లే
ఆ సీఎం గద్దెమీద ఉండాలే
అప్పుడే మన ఓటుకు విలువ

-రాజు అతికం

పొలిటికల్ సినిమా హిట్టా? ఫట్టా?

పాలమూరుకు చెందిన ఓ మాజీ ఎంపీ తన రాజకీయ వారసుడి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఏకంగా రూ.రెండు కోట్లు ఖర్చు చేసి కొడుకునే హీరోగా పెట్టి సినిమా తీయించారు. ఏకంగా థియేటర్‌ను కొనుగోలు చేసి జనాలకు ఉచితంగా సినిమా చూయించారు. మూవీ ఫట్ కావడంతో హీరో కాస్త జీరో అయిపోయారు. గత ఎన్నికల్లో నమ్మిన పార్టీనే నట్టేట ముంచేందుకు చేసిన ఎత్తుగడలు ఫలించకపోవడంతో ఆయనకు ఎంపీ టికెట్ దక్కలేదు. బీజేపీలో సెటిల్ అయ్యారు. కట్ చేస్తే పొలిటికల్ సినిమాలో తన కొడుకును హీరో చేద్దామనుకొని షాద్‌నగర్ నియోజకవర్గంలో తిప్పుతూ అక్కడి నేతలకు కొరకరాని కొయ్యగా తయారు చేశారు. షాద్‌నగర్ అభ్యర్థిగా ప్రాజక్ట్ చేయడానికి స్క్రిప్ట్ కూడా తయారు చేశారు. అక్కడ మరో బలమైన బీసీ నేత చేరడంతో వీరి పప్పులు ఉడకలేదు. ఇంకేముంది తన పలుకుబడితో బీజేపీలో చక్రం తిప్పి ఏకంగా మహబూబ్‌నగర్ టికెట్‌ను తన కొడుక్కి ఇప్పించుకున్నారు. టికెట్ ఆశించిన సీనియర్లంతా ఇదేమిటని ముక్కున వేలేసుకొని పార్టీలోంచి చల్లగా జారుకున్నారు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉన్నది. బీఆర్ఎస్‌ను ఢీకొట్టాలంటే హేమాహేమీలే వెనుకడుగు వేస్తున్న సమయంలో ఓ బచ్చాగాడికి టికెట్ ఇస్తే ఎలా అని సీనియర్లు గుస్సా అవుతున్నారు. కొడుకు కోసం పాట్లు పడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పొలిటికల్ సినిమాకు తానే దర్శకత్వం వహిస్తున్నారు.. ఈ సినిమా కూడా ఫట్ అయ్యేలా ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

-నీమ్‌కార్ వెంకటేశ్వర్‌రావు

బిగ్ స్టోరీ

అహో హైదరాబాద్!

సిలికాన్ వ్యాలీగా పేరున్న బెంగళూరును సైతం వెనక్కి నెడుతూ ఐటీ రంగంలో నువ్వా నేనా అన్నట్లుగా హైదరాబాద్ పోటీ పడుతున్నది. ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా కేటీఆర్ తీసుకున్న చొరవతో దేశ, విదేశాలకు చెందిన ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు గత పదేండ్ల కాలంలో వేల కోట్ల పెట్టుబడులతో నగరానికి వచ్చాయి. వాటి ద్వారానే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న భాగ్యనగరం షాన్ హైదరాబాద్ అన్న పేరును నిలబెట్టుకుంటున్నది.

- విశ్వనగరమే లక్ష్యంగా పటిష్టమైన ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు
- నిరంతరం నాణ్యమైన విద్యుత్.. పుష్కలంగా తాగునీరు
- ట్రాఫిక్ చిక్కులు లేకుండా ముందుచూపుతో రోడ్ నెట్‌వర్క్
- మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కార్యాచరణ
- క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు.. మారిన నగర రూపురేఖలు

- హైదరాబాద్ జిగేల్.. బెంగళూరు బెంబేలు
- రెండు నగరాల మధ్య కొనసాగుతున్న ఫ్యాన్ వార్

... శేఖర్ బరిగెల

ఐటీ, బీటీ, ఇంజినీరింగ్ పరిశ్రమలంటే ఒకప్పుడు బెంగళూరుకు పెట్టింది పేరు. కానీ ఇప్పుడు ఈ రంగాల్లో హైదరాబాద్ దూసుకుపోతున్నది. వరల్డ్ టాప్ టెన్‌లో ఉండే అన్ని కంపెనీలు ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్... ఇలా ఐటీ రంగంలోని కంపెనీలే కాకుండా బయోటెక్నాలజీ, ఫార్మా, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఆర్‌అండ్‌డీ రంగాల్లో ఉన్న కంపెనీలు హైదరాబాద్‌లో వాలిపోయాయి. అమెరికా, ఇతర దేశాల్లోని కంపెనీల ప్రధాన కార్యాలయాల తర్వాత వాటి అతి పెద్ద కేంద్రాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

మసకబారుతున్న బెంగళూరు ప్రతిష్ట

మొన్నటి వరకు ఐటీ, బీటీ రంగాలకు క్యాపిటల్ సిటీగా పేరు తెచ్చుకున్న గార్డెన్ సిటీ బెంగళూరు ప్రతిష్ట మసకబారుతున్నది. ఏదోఒక వివాదం అక్కడ అభివృద్ధిపై ప్రభావం చూపుతున్నది. ఒకప్పుడు బెంగళూరు ఎంతో బాగుండేది అనేవారే ఇప్పుడు తీవ్ర స్థాయిలో సోషల్ మీడియా వేదికగా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అందుకు డిజిటల్ సేవలు అందించే ఖాతా బుక్ సంస్థ వ్యవస్థాపకుడు రవీశ్ నరేశ్ చేసిన ఒక ఎక్స్ (ట్వీట్) ఉదాహరణ గా చెప్పవచ్చు. 'కోట్ల రూపాయల పన్నులు చెల్లిస్తున్నా బెంగళూరులోని స్టార్టప్ కంపెనీలకు తిప్పలు తప్పడం లేదు'.. అని రవీశ్ నరేశ్ ట్వీట్ చేశారు. ఇండియన్ సిలికాన్ వ్యాలీలో గతుకుల రోడ్లు, పవర్ కట్స్, అస్తవ్యస్తమైన నీటి సరఫరా, నడిచేందుకు ఉపయోగపడని ఫుట్‌పాత్‌లు ఉన్నాయని వాపోయాడు. 'బెంగళూరుతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాలున్నాయ'ంటూ సోషల్ మీడియా వేదికగా బెంగళూరు పరిస్థితులపై తన అభిప్రా యాన్ని పేర్కొన్నారు. ఇలా ఒక్కరో ఇద్దరో కాదు... ఎంతో మంది బెంగళూరు పరిస్థితిపై మండిపడుతూ హైదరాబాద్ అభివృద్ధి అద్భుతంగా ఉందంటూ మాట్లాడుతు న్నారు. దీనికి కారణం గత 9 ఏండ్ల కాలంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహానగరాభివృద్ధికి తీసుకున్న కార్యాచరణే.

రెండు నగరాల మధ్య పోలికతో ఫ్యాన్ వార్...

విశ్వనగరిగా హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలను ఆకట్టుకుంటున్నది. దీనికి కారణం ఆయా కంపెనీలకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఉండడమే. ఇది బెంగళూరులో తగ్గుతూ వస్తుండడం, హైదరాబాద్‌లో పెరుగుతుండడంతో రెండు నగరాల మధ్య బెంగళూరు-హైదరాబాద్ మధ్య డెవలప్‌మెంట్ ఫైట్ మొదలయ్యింది. సినిమా హీరోల తరపున ఫ్యాన్స్ తారస్థాయిలో రెచ్చిపోతుంటారు. అలాంటి పరిస్థితే ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరుల మధ్య ఫ్యాన్ వార్ సోషల్ మీడియా వేదికగా జోరుగా నడుస్తున్నది. హైదరాబాద్ గొప్పతనాన్ని చారిత్రాత్మకంగా, ఐటీపరంగా, అభివృద్ధి పరంగా వివరిస్తూ, ఐటీ కారిడార్‌లో ఆకాశ హర్మ్యాలను, విశాలమైన రోడ్లను పోస్టు చేస్తున్నారు.

మౌలిక వసతులకు సర్కారు పెద్దపీట

మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూ శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పటిష్టమైన వ్యవస్థలను తీర్చిదిద్దింది తెలంగాణ సర్కార్. ముఖ్యంగా మంచినీరు, విద్యుత్ వంటి అంశాల్లో ఎంతో ముందుచూపుతో సీఎం కేసీఆర్ 50 ఏండ్ల అవసరాలే లక్ష్యంగా వాటిని సమకూర్చారు. ఐటీ మంత్రిగా కేటీఆర్ రెండు దఫాలు తీసుకున్న నిర్ణయాలు ఐటీ రంగానికి మరెప్పటికీ డోకా లేదన్నట్లుగా మారింది.

బయో ఏసియా సదస్సు మన దగ్గరే...

ప్రపంచ ఐటీ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా తమ రెండో అతి పెద్ద కార్యాలయాలను నిర్వహిస్తుండగా, ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లోని ప్రపంచ స్థాయి కంపెనీలు ఇక్కడి తమ ఆర్‌అండ్‌డీ కేంద్రాలతోపాటు తయారీ కేంద్రా లను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నేండ్లుగా బయో ఏసియా సదస్సును నగరంలోనే నిర్వహిస్తు న్నది. వివిధ దేశాల ప్రముఖ కంపెనీల నుంచి హాజరవుతున్న ప్రతినిధు లకు ఇక్కడి అనుకూలతలు, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సా హకాలను వివరిస్తున్నారు.

గ్లోబల్ కార్యకలాపాలకు కేంద్రంగా...

ప్రపంచ స్థాయి కంపెనీలు హైదరాబాద్‌ను తమ గ్లోబల్ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకుంటున్నాయి. ఐటీ రంగంలో సూపర్ పవర్‌గా మారిన హైదరాబాద్ క్రమంగా వివిధ రంగాల్లో పరిశోధనలు, అభివృద్ధి అంశంలోనూ అగ్ర స్థానానికి చేరుకుంటున్నది. ఇటీవల అంతర్జాతీయ అధ్యయన సంస్థ ఎఫ్‌డీఐ బెంచ్‌మార్క్ తాజా నివేదికే అందుకు నిదర్శనం. హైదరాబాద్ మహా నగరం ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉందని ఎఫ్‌డీఐ బెంచ్‌మార్క్ తన నివేదికలో వెల్లడించింది.

దేశంలోనే మొదటి పవర్ ఐలాండ్‌గా హైదరాబాద్

ప్రస్తుతం దక్షిణ భారతదేశంలోని పలు నగరాల పరిస్థితిని అంచనా వేస్తే... కేరళలో విద్యుత్ సరఫరా వ్యవస్థ చాలా ఘోరంగా ఉందని చెబుతారు. ఐటీ రాజధానిగా పిలువబడుతున్న బెంగళూరు మహా నగరం ప్రస్తుతం సరైన కరెంటు సరఫరా వ్యవస్థ, సరిపడా సబ్‌స్టేషన్ల సామర్థ్యం లేక అవస్థలు పడుతున్నది. తమిళనాడులో డిమాండ్-సరఫరా బొటాబొటీగా ఉన్నది. హైదరాబాద్ మెట్రో నగరం పరిస్థితి వీటన్నింటికీ భిన్నం. ఇక్కడ ప్రస్తుతం పీక్ కరెంటు డిమాండు 3400 మెగావాట్లు కాగా... ఇప్పటికిప్పుడు ఆరు వేల మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం హైదరాబాద్ ఐలాండ్ పరిధిలో అందుబాటులో ఉన్నది. వీటన్నింటికీ మించి భారతదేశ గ్రిడ్ వైఫల్యం చెందినప్పటికీ హైదరాబాద్ పవర్ ఐలాండ్ స్వతంత్రంగా పని చేసేలా సీఎం కేసీఆర్, విద్యుత్ శాఖాధికారులు రూపొందించారు.

ఆఫీస్ స్పేస్‌లో అగ్ర స్థానం...

హైదరాబాద్‌లో మెరుగైన మౌలిక వసతులు, అందుబాటులో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నివాసయోగ్యంగా ఉండడం, అత్యంత అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో అగ్రస్థానానికి చేర్చుతున్నాయి. ఇప్పటి వరకు ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో అగ్ర స్థానంలో ఉండే బెంగళూరును మించి వృద్ధి రేటును కనబరుస్తున్నది హైదరాబాద్. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో వ్యాపార, వాణిజ్య సముదాయాల ఏర్పాటు మాత్రమే కాకుండా రెసిడెన్షియల్ విభాగంలోనూ హైదరాబాద్ నగరం 2014 నుంచి ఇప్పటి వరకు 48 శాతం వృద్ధిని కనబర్చిందని రియల్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్ చిక్కులు లేకుండా...

ప్రస్తుతం బెంగళూరులో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉంది. అదే హైదరాబాద్ నగరంలో దానికి పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర రాజధాని నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు 9 ఏండ్లలోనే 35 వరకు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, 135కు పైగా లింకు రోడ్లను నిర్మించారు. మరికొన్ని లింకురోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నాయి. ఐటీ కారిడార్ కేంద్రంగా సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పని చేస్తుండగా, వారంతా సాఫీగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రజా రవాణా వ్యవస్థలతోపాటు విశాలమైన కొత్త లింకు రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా తమ గమ్యస్థానాలకు సాఫీగా చేరుకుంటున్నారు.

'షాన్ హైదరాబాద్' కీలక అంశాలివే...

ఐటీ, ఐటీఈఎస్ రంగంలో బెంగళూరుతో హైదరాబాద్‌కు పోటీ ఉన్నా, ఇక్కడున్న మౌలిక వసతులు కంపెనీలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా మెట్రో రైలు నగరంలోని నలు దిక్కుల నుంచి ఐటీ కారిడార్‌తో అనుసంధానమై ఉన్నది. ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఐటీ ఉద్యోగులు నిమిషాల వ్యవధిలోనే ఐటీ కార్యాలయాలకు మెట్రో రైలు ద్వారా చేరుకుంటున్నారు. మరో ప్రధాన అంశం ఔటర్ రింగ్ రోడ్డు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కి.మీ ఉన్న ఓఆర్ఆర్ అంతర్జాతీయ ప్రమాణాలతో 8 వరుసల ప్రధాన రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉండడంతో రవాణా పరంగా ఎంతో అనుకూలంగా ఉన్నది. కోర్ సిటీ నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు లేకుండా తమ గమ్య స్థానాలకు సులభంగా చేరుకుంటున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు గ్రేటర్ హైదరాబాద్ నలుదిక్కులా కావాల్సిన భూమి అందుబాటులో ఉంది. దీంతో పరిశ్రమలు, నివాస ప్రాంతాలు ఏర్పాటయ్యేందుకు అనుకూలంగా మారింది. వీటికి తోడు దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్ నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలు అందుబాటులో ఉన్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ కంపెనీ లు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నుంచి భారీ ప్రాజెక్టులను చేపడుతున్నాయి. వ్యాపార రంగాల వారీగా హైదరాబాద్‌లో పలు ప్రాం తాలు చాలా అనుకూలంగా ఉన్నాయి. వీటిలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో (సీబీడీ)లో బేగంపేట, సోమాజి గూడ, రాజ్‌భవన్ రోడ్డు, ఎస్‌పీ రోడ్డు ప్రాంతాలు ఉన్నాయి. సబర్బన్ బిజినెస్ డిస్ట్రిక్ట్ విభాగంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలు ఉండగా, పెరిపెరల్ బిజినెస్ డిస్ట్రిక్‌లో హైటెక్ సిటీ, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, రాయదుర్గం, కోకాపేట, పుప్పాల గూడ, మణికొండ, పోచారం, ఉప్పల్, శంషాబాద్ వంటి ప్రాంతాలు ఉన్నాయి. ఇలా ఎన్నో అనుకూల తలు హైదరాబాద్‌ను బెంగళూరు కంటే ఎంతో మెరుగైందని అనిపించేలా చేస్తున్నాయి.